సాక్షి
వికారాబాద్

గురువారం ၊ 21 ၊ మార్చి ၊ 2024



'అడుగంటిన' ఆశలు

మండుతున్న ఎండలతో జిల్లాలోని చెరువులు, కుంటల్లో నీరు అడుగంటి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 8లో▸



వాహనాల తనిఖీ

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆదేశించారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
గురువారం (సాయంత్రం) 6:33	శుక్రవారం (ఉదయం) 4:57

న్యూస్‌రీల్

'పది' పరీక్షలు సజావుగా సాగేలా చూడాలి
కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతగిరి: పదో తరగతి పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం విద్యాశాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్న పత్రాల తరలింపునకు ఫోర్ వీలర్‌నే వాడాలని సూచించారు. పరీక్ష పూర్తయిన తరువాత పేపర్లు అప్పగించే దాకా కేంద్రం విడిచి వెళ్లరాదని చీఫ్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లకు సూచించారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దేముల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పెద్దేముల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 – 2025 సంవత్సరానికి గాను ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఏప్రిల్ 21న పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షేమంలో ముందుంటాం
ఎస్పీ కోటిరెడ్డి



ఎస్పీకి బొకే అందజేస్తున్న సొసైటీ సభ్యులు

అనంతగిరి: పోలీసు సిబ్బంది సంక్షేమంలో తాము ముందుంటామని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో కోఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేయాల్సిన పనులు, సభ్యులకు అందాల్సిన బెనిఫిట్స్, వెల్ఫేర్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లాలో కోఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బంది చనిపోయినా, ఉద్యోగ విరమణ చేసినా వారి పిల్లల ఉన్నత చదువుల కోసం ప్రతి ఏటా మెరిట్ స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఇన్‌స్పెక్టర్లు రాజు, వెంకటేశం, జిల్లా పోలీసు అధికారుల ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు



రథాన్ని లాగుతున్న భక్తులు

అంగరంగ వైభవంగా శివపార్వతుల రథోత్సవం

హరహర మహాదేవ శంభో శంకర నామస్మరణతో ఎల్లకొండ శివాలయం మార్మోగింది. బుధవారం తెల్లవారుజామున శివపార్వతులకు కుంకుమార్చన, అభిషేకం,హారతి,మంత్ర పుష్పం పూజలు నిర్వహించారు.
అనంతరం ఉత్సవ మూర్తులను అందంగా ముస్తాబు చేసి రథంపై ప్రతిష్ఠించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా రథోత్సవం సాగింది. వేడుకలో ఆలయ కమిటీ చైర్మన్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– నవాబుపేట

గులాబీ కోటపై గురి!

చేవెళ్ల గెలుపుపై కన్నేసిన కాంగ్రెస్, బీజేపీ
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ప్రధాన పార్టీలు
- ఉద్దండులను బరిలో దింపేందుకు ఏర్పాట్లు
- పట్టు నిలుపుకొనేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ సీటును కైవసం చేసుకుని గులాబీ కోటను బద్దలు కొట్టాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. మరోవైపు స్టీరింగ్ చేజారకుండా చూసుకోవాలని కారు పార్టీ ప్రయత్నిస్తోంది. అత్యధిక ఓట్లను కలిగి పల్లె, పట్నంల కలబోతతో కూడిన ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో పట్టుకోసం మూడు పార్టీల నుంచి ముగ్గురు ఉద్దండులు బరిలో నిలవనున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ నుంచి మాజీ జెడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీ చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఇటీవలే ఆ పార్టీకి రాజీనామా చేసి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీచేసి గెలుపొందిన ఆయన ఈ సారి చేయి గుర్తుపై పోటీచేయాలని తహతహలాడుతున్నారు. ఇక ఇప్పటివరకు ఈ స్థానం నుంచి టికెట్ ఆశించి.. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి ఆ పార్టీ అధిష్టానం షాక్ ఇచ్చేలా కనిపిస్తోంది. చేవెళ్ల ఎంపీ స్థానానికి కాకుండా మల్కాజ్‌గిరి నుంచి ఆమెను బరిలో నిలపాలని ఆపార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు వారి వెంట నడిచిన కేడర్ నైరాశ్యంలో పడిపోయింది.

హాట్ టాపిక్‌గా చేవెళ్ల సీటు..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో జిల్లాలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల సహా వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం తెలంగాణలో చేవెళ్ల లోక్‌సభ సీటు హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడి నుంచి హేమాహేమీలు పోటీ చేస్తుండటమే ఇందుకు కారణం. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో 23 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 12,70,687 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ జి.రంజిత్‌రెడ్డికి 5,16,363 ఓట్లు (40.64 శాతం) రాగా.. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 5,0,318 ఓట్లు(39.61 శాతం) వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బి.జనార్దన్‌రెడ్డికి 1,95,919 ఓట్లు(15.42)వచ్చాయి. బీఎస్పీ సహా ఇతర పార్టీలకు కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. ప్రస్తుతం బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా గత ఎన్నికల్లో వేర్వేరు పార్టీల్లో కొనసాగిన వారే. రాజకీయంగా, ఆర్థికంగా ఈ ముగ్గురూ ఉద్దండులే. వీరిలో ఏ ఒక్కరు కూడా ఖర్చుకు వెనుకాడేవారు కాదు.

బీఆర్‌ఎస్ నేతల భేటీ..

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆ ర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి బుధవారం శంషాబాద్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సహా మాజీ మంత్రి సబితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు సురభీ వాణిదేవి, దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి భేటీలో పాల్గొన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు చర్చించారు. ఎలాగైనా చేవెళ్ల గడ్డపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేస్తామని కారు పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నైరాశ్యంలో పట్నం వర్గం..!

ఉమ్మడి జిల్లా రాజకీయాలపై పట్నం దంపతులది ప్రత్యేక ముద్ర. అధికారం ఎక్కడ ఉంటే.. మొదటి నుంచి వీరు అక్కడే కొనసాగుతూ వచ్చారు. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తన సతీమణి పట్నం సునీతారెడ్డిని కూడా రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. 2006లో టీడీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన ఆమె బంట్వారం, యాలాల్, కోట్‌పల్లి జెడ్పీటీసీగా మూడుసార్లు గెలుపొందారు. 2006 నుంచి 2011 వరకు, ఆ తర్వాత 2014 నుంచి (టీడీపీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు) 2019 వరకు ఇలా రెండుసార్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2019 నుంచి ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఇటీవలె ఆమె బీఆర్ఎస్‌ను వీడి... కాంగ్రెస్‌లో చేరారు. అయితే చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలోకి పోటీచేసేందుకు గ్రౌండ్ లెవల్‌లో అంతా సిద్ధం చేసుకుంటుండగా.. ఇక్కడి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరుకోవడం.. ఆ వెంటనే ఇక్కడి ఎంపీ స్థానానికి ఆయన పేరును ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో పట్నం వర్గీయులు పునరాలోచనలో పడ్డారు.



చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
మహేశ్వరం	511	5,56,110	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	535	5,99,778	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	622	7,47,757	3,95,460	3,52,069	144
చేవెళ్ల	298	2,69,166	1,35,261	1,33,820	06
పరిగి	269	2,66,273	1,33,625	1,32,639	09
వికారాబాద్	284	2,31,679	1,15,019	1,16,647	13
తాండూరు	269	2,42,3849	1,18,228	1,25,614	07

బాధ్యతగా పనిచేయండి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎన్నికల సిబ్బందికి దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్ సర్వైలెన్, ఇతర ఎన్నికల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిస్తుందని తెలిపారు. జిల్లాలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఆరు ఎస్ఎస్‌టీ బృందాలు మూడు షిఫ్టుల్లో పని చేస్తాయని తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆదేశించారు. ఏఆర్ఓలు, పోలీస్ అధికారులు వారి పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, సదుపాయాలు, భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి వీలు లేదన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగులు ఇళ్ల వద్దే ఓటు వేసేందుకు ఫారం 12డీ అందజేయాలన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రశాంత ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగదు తరలింపు, మద్యం పంపిణీ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు, నాయకులు ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రచారం చేసుకోవాలని సూచించారు. ప్రచార సామగ్రిపై ప్రచురణ కర్త పేరు, వివరాలు లేకుంటే సీజ్ చేస్తామన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ వీర కాంతం, రాంరెడ్డి ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, ఆర్డీఓ వాసు చంద్ర, జెడ్పీ సీఈఓ సుధీర్, కార్మిక శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా పాయింట్ ప్రారంభం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి మీడియా పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్‌తోపాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని అధికారులకు సూచించారు. పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి చెన్నమ్మ, సిబ్బంది ప్రభాకర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

రంజిత్‌ది స్వార్థ రాజకీయం

- వ్యాపారాల కోసమే బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లోకి
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్

తాండూరు: ఎంపీ రంజిత్‌రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ రాజకీయ భిక్ష పెడితే ఆ విశ్వాసం కూడా లేకుండా పార్టీకి మోసం చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంజిత్‌రెడ్డి జిల్లా వాసి కాకపోయినా కేసీఆర్ టికెట్ ఇచ్చి గెలిపించారని గుర్తు చేశారు. బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఓడిపోగానే రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం దారుణమన్నారు. వ్యాపారాలను చక్కబెట్టుకునేందుకే పార్టీ మారారని ఆరోపించారు. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ పార్టీతో అంటకాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పదవులకు రాజీనామా చేసి వెళ్లిపోవాలన్నారు. రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్ వీడుతున్నారని కొందరు విష ప్రచారం చేస్తున్నారని, ఆయనకు పార్టీ మారే ఆలోచనే లేదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ – బీజేపీ చీకటి ఒప్పందం బయట పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని బీసీ సామాజిక వర్గం అయిన కాసాని జ్ఞానేశ్వర్‌కు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 67శాతం బీసీలు ఉన్నారని, వారి ఆశీస్సులు కాసానికే ఉంటాయన్నారు. ఆయన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ దేవుడి పేరిట స్వార్థ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గం కొడంగల్‌ను మాత్రమే అభివృద్ధి చేస్తున్నారని, జిల్లా గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు.సమావేశంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సాయిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నరేందర్‌గౌడ్, నాయకులు శ్రీనివాసాచారి, రాజు, చందర్ ముదిరాజ్, అనిల్, రాజన్‌గౌడ్, రవి, ఇంతియాజ్ పాల్గొన్నారు.

వాట్సాప్ వైద్యం | ప్రాణానికి పైకం!

- పరిగిలో ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకం
- తెలిసీ తెలియని వైద్యానికి నిండు ప్రాణం బలి
- దిక్కులేనిదైన బాధిత కుటుంబం



శ్రీనివాస్ (ఫైల్)



ఆర్ఎంపీ డాక్టర్‌తో వాగ్వాదానికి దిగిన మృతుని బంధువులు

పరిగి: ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి ప్రాణం కోల్పోయాడు.. ఈ విషయమై బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో ప్రాణానికి లెక్కగట్టి వ్యవహారం.. సెటిల్ చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం పరిగిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం ఊటుపల్లికి చెందిన బంటు శ్రీనివాస్(29).. ఛాతిలో నొప్పి వస్తోందని పరిగిలోని ఆర్ఎంపీ డాక్టర్ గఫార్ వద్దకు వెళ్లాడు. శ్రీనివాస్‌కు ఈసీజీ చేసిన వైద్యుడు.. మందులు రాసిచ్చాడు. ఆస్పత్రిలోనే ఉన్న మెడికల్ షాపులో మందులు తీసుకుని, వేసుకున్న శ్రీనివాస్ పది నిమిషాల్లో అక్కడే కుప్పకూలాడు. ఆతర్వాత పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో ఆగ్రహానికి గురైన మృతుడి బంధువులు ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్ ఎదుట ఆందోళన చేపట్టారు. తెలియని వైద్యం చేయడంతోనే శ్రీనివాస్ చనిపోయాడని డాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. అయితే ఈసీజీ రిపోర్ట్‌ను సదరు ఆర్ఎంపీ.. వాట్సాప్‌లో మరో వైద్యుడికి పంపించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అంతా నార్మల్ అంటూ వాట్సప్ వైద్యుడు సూచించడంతో ఆర్ఎంపీ మందులు రాసిచ్చాడు. వీటిని వేసుకున్న కొద్ది సేపటికే బాధితుడు కన్నుమూశాడు. అయితే తాను సాధారణ మందులు మాత్రమే ఇచ్చానని, శ్రీనివాస్ మృతికి తాను బాధ్యుడిని కాదని.. సదరు ఆర్ఎంపీ ఆందోళనకారులకు చెప్పడం గమనార్హం.

రోడ్డున పడ్డ కుటుంబం

మృతుడు శ్రీనివాస్‌కు.. తల్లిదండ్రులతో పాటు భార్య అనిత ఐదేళ్ల లోపు పాప, బాబు ఉన్నారు. శ్రీనివాస్ మృతితో బాధిత కుటుంబం రోడ్డున పడింది. వృద్ధాప్యంలో తమకు అండగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇన నా బతుకు ఎందుకు అంటూ అనిత విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది. ఇదిలా ఉండగా శ్రీనివాస్ ప్రాణానికి లెక్కగట్టి రూ.2 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటాలని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి హస్తం పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గ నేతలతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి బుధవారం నగరంలోని ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి రాకతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి బలం పెరిగిందన్నారు.



వేం నరేందర్‌రెడ్డితో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, నాయకులు

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



అర్చనలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు, భక్తులు

పరిగి: శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. లక్ష తులసి అర్చన, చండీ హోమం, మహా పూర్ణాహుతిలో ఎమ్మెల్యే కొప్పుల రామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు పాల్గొని, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోండి



ఏడీకి ఫిర్యాదు చేస్తున్న కిష్టప్ప

తాండూరు రూరల్: మల్కాపూర్ శివారు పట్టా భూముల్లో ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న మైనింగ్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని జక్లపల్లి కిష్టప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మైనింగ్ ఏడీ సత్యానారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 70లో కోత్లాపూర్ గ్రామానికి చెందిన మల్లేశం అక్రమంగా మైనింగ్ తవ్వకాలు జరుపుతూ.. తరలిస్తున్నారని పేర్కొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

పరిగి: పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పల్లెల్లో ప్రధాని నరేంద్ర మోదీ నామస్మరణ ఉందని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాధవరెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు.

35 లీటర్ల మద్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: బెల్ట్ దుకాణాలపై పోలీసులు దాడులు చేసి, 35 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సాహెబ్‌గూడ, మంగల్‌పల్లి, పోచారం, ఎల్మినేడు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ధారూరు: నీరు లేక వెలవెలబోతున్న గట్టెపల్లి చెరువు



తాండూరు రూరల్: చింతమణిపట్నంలో చుక్కనీరు లేని దొబ్బలోని చెరువు



పెద్దేముల్: జనగాం గ్రామ శివారులో నీరు అందక ఎండిన వేరుశనగ పంట



యాలాల: మండల శివారులోని మాలకుంట చెరువులో అడుగంటిన నీరు

'అడుగంటిన' ఆశలు

ప్రమాద స్థాయిలో తగ్గిన భూగర్భజలాలు

- నెర్రెలు బారిన చెరువులు, కుంటలు
- తడిలేక ఎండుతున్న పంటపొలాలు

వేసవి ఆరంభం నుంచే భానుడు విశ్వరూపం దాల్చాడు. మండుతున్న ఎండలతో జిల్లాలోని చెరువులు, కుంటల్లో నీరు అడుగంటి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నేలలు నెర్రెలుబారి దర్శనమిస్తున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. వ్యవసాయ బోరు బావులు వట్టిపోయాయి. ఫిబ్రవరి నుంచే ఎండలు మండటం, చెరువులు, కుంటలతో పాటు, జలాశయాల్లో నీటిమట్టం తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. వచ్చే రెండు నెలలు పరిస్థితి ఇంకెలా ఉండబోతుందోనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



దోమ: మోత్కుర్‌లో జలం తగ్గి, తక్కువగా పోతున్న బోరు



దౌల్తాబాద్: ఎండిన వరిచేనులో కాడెడ్లను మేపుతున్న రైతు

పశువులకు మేతగా వరి పంట



తిమ్మాయిపల్లిలో వరి పంటను మేపుతున్న రైతు

పరిగి: ఎన్నో ఆశలతో పంటసాగు చేసిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. రబీ పంటగా వరి, మొక్కజొన్న, జొన్నను బోరు బావుల కింద పండించారు. గత వర్షాకాలంలో ఆశించిన మేర వర్షాలు కురవలేదు. చాలా మంది రైతులు బోరు బావుల కిందే పంటలు వేశారు. కానీ.. పంట చేతికి రాకముందే, చెరువుల్లో జలకళ తగ్గి, బోర్లు, బావులు అడుగంటుతున్నాయి. బోర్లు కులాయిల్లా నీటి తడులను ఇస్తుండటంతో పంటలు ఎండుముఖం పట్టాయి. చేసేది లేక పంటలను పశువులకు మేతగా వేస్తున్నారు. పంట చేతికి రాక అప్పుల్లో కూరుకుపోతున్నామని, నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నిరుపయోగం.. నీటి ట్యాంకు



మోత్కుర్‌లో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

దోమ: వేసవి తీవ్రతతో ఫిబ్రవరి నుంచే చెరువులు, కుంటల్లో నీరు తగ్గుముఖం పట్టాయి. భూగర్భజలాలు అడుగంటి, బోరుబావులు ఎండిపోయాయి. ఫలితంగా వ్యవసాయ బావుల వద్ద బోర్ల నుంచి కొద్దిపాటి నీరే వస్తోంది. అరకొర సాగునీటితో వ్యవసాయం ఎలా చేయాలని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇక తాగునీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. బోరు బావుల్లో జలం లేక.. ట్యాంకర్లకు నీటి సరఫరా ఆగిపోయింది. ఫలితంగా అవి అలంకార ప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. మిషన్ భగీరథ నీరు సరఫరా.. చేస్తున్నప్పటికీ పలు గ్రామాల్లో సరిపడా నీరు రావడం లేదు. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు.

పొలాలకు 'దారి'చూపండి





తహసీల్ కార్యాలయం వద్ద రైతులు (ఇన్‌సెట్లో) కబ్జాకు గురైన నక్ష బాట

- తహసీల్దార్ కిషన్‌కు రైతుల వినతి
- నక్ష బాటను కబ్జాచేశారంటూ ఫిర్యాదు

పెద్దేముల్: పొలాలకు వెళ్లేందుకు నక్ష బాటను చూపించాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం ఇందూరు గ్రామ రైతులు తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందచేశారు. తాతల కాలం నుంచి పొలాలకు వెళ్లే బాటను భూ వ్యాపారులు ఆక్రమించడం వలన రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. వెంటనే కబ్జాకోరుల చెరనుంచి బాటను విడిపించి, 'దారి'చూపాలని రైతులు నర్సమ్మ, బాల్‌రాజ్, శాతమ్, ప్రదీప్, జాఫర్ బేగ్, మౌలాన్ బేగ్, బస్సమ్మ, మసూల బేగ్, నవీన్, నర్సింహులు, బాలు, ప్రవీణ్, రాములు, సంగప్ప, అంతప్ప, జలీల్, ఎల్లమ్మ, పెంటమ్మలు తహసీల్దార్‌ను కోరారు. అనంతరం స్పందించిన తహసీల్దార్.. మండల సర్వేయర్ శ్రీహరికి ఫోన్‌లో సమస్యను వివరించారు. రెండు, మూడు రోజుల్లో సర్వే చేయించి, రహదారిని వదిలేలా చూస్తామని రైతులకు హామీఇచ్చారు.

డ్రైవర్, కండక్టర్‌తో ఘర్షణ

ముగ్గురిపై కేసు నమోదు

యాచారం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ.. డ్రైవర్, కండక్టర్‌తో ఘర్షణ పడిన సంఘటనలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నల్గొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో మంగళవారం రాత్రి 10 గంటలకు నగరానికి చెందిన సూరిగౌడ్, మురళీ, రామలింగంలు మాల్‌లో బస్సు ఎక్కి, నగరానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో యాచారం-మాల్ మధ్యలో ఆర్టీసీ ఉద్యోగులతో వారు ఘర్షణకు దిగారు. దీంతో సిబ్బంది యాచారం పోలీస్‌స్టేషన్ వద్ద బస్సును ఆపి, గొడవకు దిగిన ముగ్గురిని పోలీసులకు అప్పగించారు. అయినప్పటికీ.. ఠాణాలో వాగ్వాదం చేశారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

కూతురు హత్య కేసులో తల్లికి రిమాండ్

ఇబ్రహీంపట్నం: కన్న కూతుర్ని కడతేర్చిన కేసులో కసాయి తల్లి కటకటాల పాలయింది. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్యలు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన ఎం.భార్గవి(20) డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతూ.. అదే గ్రామానికి చెందిన శశిను ప్రేమించింది. వారి ప్రేమ వ్యవహారం తెలిసి భార్గవి కుటుంబంలో గొడవలు జరిగాయి. బంధువుల అబ్బాయితో యువతి వివాహం జరిపించాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా.. తాజాగా సోమవారం భార్గవి ఇంటికి శశి వచ్చాడు. ఈ క్రమంలో యువతి తల్లి జంగమ్మను గమనించిన యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తీవ్ర ఆవేశానికి గురైన జంగమ్మ.. కూతుర్ని మందలించి, కొట్టింది. చీర కొంగును మెడకు బిగించి ఊపిరి ఆడకుండా చేసింది. దీంతో భార్గవి చనిపోయింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులను విచారించిన పోలీసులు.. యువతి చావుకు తల్లి జంగమ్మనే కారణమని, నిందితురాలిగా పేర్కొంటూ ఆమెను బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఆగి ఉన్న కారులో మంటలు



మంటల్లో కాలిపోతున్న కారు

ఆమనగల్లు: బంధువుల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి కారులో మంటలు చెలరేగిన సంఘటన బుధవారం ఆమనగల్లు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన శశికుమార్ తన కారులో పట్టణంలోని కాశీనాథ్ ఇంటికి మంగళవారం రాత్రి వచ్చారు. కారును ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేశారు. ఇదిలా ఉండగా బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగడంతో గమనించిన కాలనీవాసులు వెంటనే స్పందించారు. కారుపై నీళ్లు చల్లి మంటలు ఆపే ప్రయత్నం చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోవడంతో సమాచారం అందుకున్న ఎస్‌ఐ బాల్‌రాం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు సేకరించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డుపాలైన అంగన్‌వాడీ గుడ్లు



గాజీపూర్ వంతెన వద్ద రోడ్డుపై కోడిగుడ్లు

పెద్దేముల్: అంగన్‌వాడీల్లో ఓనమాలు దిద్దుతున్న చిన్నారులకు అందాల్సిన కోడిగుడ్లు సుమారు మూడు ట్రేలు రోడ్డుపాలయ్యాయి. ఈ సంఘటన తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిపై గాజీపూర్-బుద్దారం రహదారి మధ్యలో ఉన్న గాజీపూర్ వంతెన వద్ద బుధవారం దర్శనమిచ్చింది. పగిలిన గుడ్లపై ఎర్రని రంగు గుర్తు ఉంది. వాటిని చూసిన ప్రయాణికులు అంగన్‌వాడివేనని గుర్తించారు. ఈ గుడ్లు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలించాలనుకున్నారు?. తరలిస్తున్న క్రమంలో కింద పడిపోయాయా? లేక ఎవరైనా అక్రమంగా కొనుగోలు చేసి, భయంతో ఇక్కడ పడేశారా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పటికే మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సక్రమంగా సరఫరా కావడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ.. పోషకాహారం పేరుతో చిన్నారులకు చేరాల్సిన గుడ్లు ఇలా రోడ్డు పాలు కావడం బాధాకరమే. సంబంధిత అధికారులు విచారణ చేపడితే కాని.. ఈ గుడ్ల తతంగం బయటపడదు.

అడ్డువస్తున్నాడని అంతమొందించారు..

మేనబావతో కలిసి భర్తను హతమార్చిన భార్య



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ. వెనుక నిందితులు

పరిగి/పూడూరు: అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని మేనబావతో కలిసి భర్తను హతమార్చింది ఓ భార్య. ఈ సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. పూడూరు మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన హరిజన సంజయ్(35) మూడు రోజుల క్రితం హత్యకు గురయ్యాడు. మృతుడికి దోమ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన అనితతో వివాహం జరిగింది. ఆ వివాహిత అదే మండల పరిధి శివారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తన మేన బావ అయిన కాళ్లాపూర్ గోపాల్‌తో వివాహేతర సంబంధం నెరపుతోంది. ఇది తెలిసిన సంజయ్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో తమ బంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య.. అతన్ని ఎలాగైనా చంపాలనుకుంది. అందుకు అనిత, గోపాల్, లాలుప్రసాద్‌లు కలిసి పథకం పన్నారు.

మద్యం సీసాలతో కొట్టి..

ఈ నెల 17న సాయంత్రం సంజయ్‌ను గోపాల్, లాలుప్రసాద్‌లు ఇద్దరు కలిసి కారులో వికారాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఫుల్లుగా మద్యం తాగించారు. అక్కడి నుంచి పూడూరు మండలం ఎన్కెంపల్లి గ్రామ శివారు ఓ ఫాంల్యాండ్ వద్ద మరోసారి మద్యం తాగించారు. అనుకున్న ప్రకారం.. మద్యం బాటిళ్లతో తల వెనుక భాగంలో బలంగా కొట్టారు. దీంతో తీవ్ర రక్తస్రావమై సంజయ్ అక్కడిక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. తమదైన శైలిలో విచారించగా గోపాల్, అనిత, లాలుప్రసాద్‌లు నేరం అంగీకరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పకడ్బందీగా వాహనాల తనిఖీ

శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి



వాహన తనిఖీని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

కడ్తాల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం సమీపంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం అదనపు డీసీపీ రామ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి, పోలీస్ సిబ్బందికి డీసీపీ సూచనలు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, అక్రమంగా లిక్కర్, గంజాయి వంటివి తరలిస్తుంటే తనిఖీలో పట్టుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని పకడ్బందీగా తనిఖీ చేపట్టాలన్నారు. 24 గంటలు నిఘాను పటిష్టంగా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు శివప్రసాద్, ప్రమోద్, ఎస్‌ఐలు వరప్రసాద్, బాల్‌రాం, శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



పోలీసుల ఆధీనంలో ఉన్న టిప్పర్లు

మంచాల: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. ఎస్‌ఐ రవినాయక్ వివరాల ప్రకారం.. మంచాల-జాపాల మధ్య ఓ వ్యవసాయ పొలం వద్ద నుంచి మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు టిప్పర్లను ఆపారు. తనిఖీ చేయగా.. వాహనదారుల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో ఆ టిప్పర్లను ఠాణాకు తరలించారు. అనంతరం తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు స్వాధీనం చేశారు. మరో రెండు టిప్పర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన తోక రాములు(50) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. కొంత కాలంగా ఎలాంటి పని చేయకుండా ఇంటికే పరిమితం అయి, మద్యానికి బానిసగా మారాడు. అందుకు అప్పులు కూడా చేశాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం.. అత్తింటి వారు పొలం విక్రయించగా.. వచ్చిన డబ్బును తీసుకురావాలని భార్యతో పట్టుబట్టాడు. తేని పక్షంలో సొంత పొలం కొంత అమ్ముదామని గొడవకు దిగాడు. ఆమె అందుకు ఒప్పుకోకుండా.. ఆడ పిల్లలు ఉన్నారని వారించింది. దీంతో మంగళవారం గొడవపడి ఇంటి నుంచి వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. ఫోన్ చేశారు. కానీ అతను ఎత్తలేదు. దీంతో భర్త ఆచూకీ కోసం భార్య పొలం వైపు వెళ్లగా.. అక్కడ ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు ఘటనా స్థలానికి వెళ్లి చూశారు. అప్పటికే రాములు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో బాలుడి మృతి



విఘ్నేశ్ (ఫైల్)

మర్పల్లి: డెంగీ మహమ్మారి ముక్కుపచ్చలారని ఓ బాలుణ్ని బలిగొంది. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రావులపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి బుజంగం పార్వతమ్మకు నాలుగేళ్ల ఏకైక కుమారుడు విఘ్నేష్. ఈ నెల 17న బాలుడు అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి విఘ్నేష్‌ని తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. డాకర్లు పరిశీలించి నీలోఫర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దూరం కారణంగా హైదరాబాద్‌కు వెళ్లలేక సంగారెడ్డిలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించారు. విఘ్నేష్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీతో పాటు అవయవాలు చెడిపోయాయని నిర్ధారించి మెరుగైన వైద్యం కోసం నీలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో తల్లిదండ్రులు చేసేది లేక ఆదివారం రాత్రి నీలోఫర్‌కు తరలించారు. అక్కడ డాక్టర్లు బాలుని పరిస్థితి విషమంగా ఉందని.. తాము ఏమీ చేయలేమని తల్లిదండ్రులకు చెప్పారు. ఈ క్రమంలోనే బాలుడు చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. తమ ఇంటి సమీపంలో పెంట కుప్పలు, ముళ్ల పొదలు ఉన్నాయని వాటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రాణాలు తీసిన చేపల వేట

చెరువులో మునిగి ఇద్దరు మృతి



కిష్టయ్య (ఫైల్)



వెంకటేశ్ (ఫైల్)

కొత్తూరు: చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. మక్తగూడ గ్రామానికి చెందిన కిష్టయ్య(59), వడ్డె వెంకటేశ్(43) దినసరి కూలీలు. ఈ నెల 19న రాత్రి ఇద్దరు గ్రామ సమీపంలోని ఉప్పరోనికుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి, మునిగి చనిపోయారు. మరుసటి రోజు చెరువులో ఇద్దరి మృతదేహాలను గమనించిన స్థానికులు.. కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాలను బయటకు తీయించారు. వివరాలు సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై మృతుడి తల్లి పొన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.